క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

జమ్మలమడుగు : పట్టణంలోని 17వ వార్డు గడ్డ వీధిలో బుధవారం సాయంత్రం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మలు పాల్గొంటారని వార్డు కౌన్సిలర్ నూరున్నీసా, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌బాషాలు తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జమ్మలమడుగు : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు తమచేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ తెలిపారు. మంగళవారం పాత బస్టాండ్‌లోని మస్టర్ పాయింట్‌లో కార్మికుల కోసం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండ్‌వాష్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు పనులు చేసుకున్న తర్వాత కచ్చితంగా చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రమోద్‌కుమార్, మెప్మా అధికారి గంగులయ్య, రసూలమ్మ, ఉష తదితరులు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీ వేంకటరమణుడు



కల్పవృక్ష వాహనంపై శ్రీవేంకటరమణుడు

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీవేంకటరమణ స్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఐదవ రోజు వేంకటరమణుడు సతీసమేతుడై కల్పవృక్ష వాహనంపై భక్తులకు కనువిందు చేశారు. స్వామి వారి గ్రామోత్సవం పురవీధులలో మంగళవాయిద్యాల మధ్య స్వామి వారు ఊరేగుతుంటే భక్తులు చూసి తరించారు. రాత్రి స్వామివారు సర్వభూపాల వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి ఐదు శేషుల పడగలపై నాట్యం చేస్తున్నట్లు కనిపించే తీరు భక్తులను ఆకట్టుకుంది. ఆలయంలో సాయంత్రం స్వామి వారిని పల్లకిలో ఉంచి సహస్ర దీపాలంకరణ సేవ చేశారు. ఊంజల్ సేవకోసం భక్తులు ఆరాటపడ్డారు.

రేపటి నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

వల్లూరు : మండలంలోని పైడికాలువలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవ, కుంభాభిషేక మహోత్సవాలను గురువారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు స్వామి హరి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీన ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 22వ తేదీన రాత్రి 7 గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శన, 9 గంటలకు పండరి భజన వుంటుందన్నారు. 23న రాత్రి 7 గంటలకు భరత నాట్య ప్రదర్శన, అనంతరం శ్రీ చౌడేశ్వరీ మాత కళా మండలి వారిచే శ్రీ చౌడేశ్వరీదేవి జననం పౌరాణిక నాటక ప్రదర్శన వుంటుందన్నారు. 24న రాత్రి 8 గంటలకు రేలా రేలారే జానపద కార్యక్రమం వుంటుందన్నారు.

హోమియోలో అద్భుత చికిత్సలు

కమలాపురం : హోమియో వైద్యంలో అన్ని రోగాలకు అద్భుతమైన చికిత్సలు ఉన్నాయని కమలాపురం ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ తెలిపారు. మంగళవారం స్థానిక బాలయోగి అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలోని విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా హోమియో మందులు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమియో వైద్యంలో అన్ని రకాల స్వల్ప, దీర్ఘ కాలిక వ్యాధులకు అద్భుత చికిత్సలు ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థులకు జెల్సీమియమ్ 200 హోమియోపతి మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ తులశమ్మ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

సింహాద్రిపురం : స్థానిక శ్రీమహాగణపతి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశిని పురస్కరించుకుని తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీవెంకటేశ్వర స్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

రేపటి నుంచి శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీరంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి అంకురార్పణతో ప్రారంభం కానున్నట్లు ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలు తెలిపారు. స్థానిక పూల అంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథస్వామి కాంప్లెక్స్‌లో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. 9 రోజులపాటు రోజుకో అలంకారంలో ప్రత్యేక పల్లకిలో శ్రీరంగనాథుడు సతీసమేతుడై పట్టణ పురవీధులలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం



సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న వలంటీర్లు, తదితరులు



పులివెందులలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లతో వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు



పెద్దముడియంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

పులివెందుల టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్పగా ఆలోచన చేసి ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామ స్వరాజ్యం వలంటీర్ల ద్వారానే సాధ్యమైందన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమయానికి అందుతున్నాయన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. కరోనా విపత్తు సమయంలోనే వలంటీర్లు చేసిన సేవలకు వందనమని కొనియాడారు. అనంతరం ఉత్తమ సేవలకు గుర్తుగా వలంటీర్లకు ఇద్దరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, మిగిలిన వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులను ప్రకటించి నగదు బహుమతులను అందించి సత్కరించారు. మొత్తం 366 మంది వలంటీర్లు ఉండగా.. అందులో సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రల కింద వలంటీర్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రసూల్, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, కౌన్సిలర్లు కోడి రమణ, రంగనాయకులు, విజయ్ నాయుడు, ఖాదర్ బాషా, మహిళా కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలకు గుర్తింపే పురస్కారాలు

వేముల : గ్రామీణ ప్రాంత ప్రజలకు వలంటీర్లు చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం వారికి పురస్కారాలను అందిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు వలంటీర్లకు పురస్కారాలను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 5 మందికి సేవా రత్న, మిగిలిన వారందరికి సేవా మిత్రల అవార్డులను అందించామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. వారు చేసిన సేవల ద్వారా ఎంతోమందికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అర్జున్, నిర్మల, రంగనాథం, చెన్నారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, రామచంద్రారెడ్డి, శివశంకర్‌రెడ్డి, మలిరెడ్డి, గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.



వేములలో వలంటీర్లను సన్మానిస్తున్న మండల ఇన్‌చార్జి, జెడ్పీటీసీ, ఎంపీపీలు



వేంపల్లెలో సేవా రత్న అవార్డులు పొందిన వలంటీర్లతో జెడ్పీటీసీ, మండల కన్వీనర్, సర్పంచ్

వేంపల్లెలో..

వేంపల్లె : గ్రామాల్లో వలంటీర్ల సేవలు మరువలేనివని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో వలంటీర్ల సేవా పురస్కారాలలో సేవా రత్న, సేవా మిత్రలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు వలంటీర్లు చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం నగదు బహుమతిని అందించారన్నారు. గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. వలంటీర్ల కులగణన యుద్ధ ప్రాతిపదిన కష్టపడి పని చేశారని వారు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సేవా రత్న అవార్డులకు ఎంపికైన వలంటీర్లను శాలువాలతో సత్కరించి సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివిజా సంపతి, మండల స్పెషలాఫీసర్ రవీంద్రారెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు మెహతాజ్, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీవో లక్ష్మినరసింహ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో వారు పాల్గొని వలంటీర్లకు పురస్కారాలు అందజేసి మాట్లాడారు. సేవా రత్నకు చీకటి శ్రీను, బి.జయసుధ, పి.సుప్రియ, పి.శివనాగమ్మ, జి.వెంకటసుబ్బారెడ్డి, 165 మంది వలంటీర్లు సేవామిత్ర అవార్డుకు ఎంపికయ్యారన్నారు. సేవారత్నకు ఎంపికైన వారికి రూ.30వేలు, సేవామిత్రకు ఎంపికైన వారికి రూ.15 వేలు అందజేస్తున్నామన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న 14 సంవత్సర కాలంలో ఈ విధంగా సంక్షేమ పథకాలు ఒక్కటైన అమలు పరచార అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వ్యావసాయ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ చవ్వా కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి, విశ్వనాథరెడ్డి, గ్యాస్ శివారెడ్డి, తిమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పులివెందుల మున్సిపాలిటీని రాష్ట్రంలో ఏ–1 మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేయాలన్నారు. అందుకు సంబంధించి మున్సిపాలిటీకి రావాల్సిన అన్ని బకాయిలు ప్రజలతో చెల్లించే విధంగా కౌన్సిలర్లు చొరవ చూపాలన్నారు. అనంతరం ప్రతిపాదించిన వివిధ అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

తొండూరు : ప్రజల నుంచి వచ్చిన ఎలాంటి సమస్యనైనా అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ నారాయణమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవికాలంలో నీటి సమస్య, విద్యుత్ సమస్యలపై వెంటనే అధికారులు స్పందించాలన్నారు. అలాగే ఉపాధి హామీ ఏపీఓ లావణ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పంట పొలాలకు వెళ్లే రోడ్లకు సంబంధించి వెంటనే మస్టర్‌లో అప్‌లోడ్ చేసి బిల్లులు వేగవంతమయ్యేలా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. విద్యుత్ ఏఈ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి విద్యుత్ సమస్య జఠిలంగా ఉందని.. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలనుంచి విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు వేగవంతంగా చర్యలు తీసుకుంటోందని.. దీనివల్ల విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. మండల పరిశీలకుడు బండి రామమునిరెడ్డి, తాలుకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు సావిత్రమ్మ, కో ఆప్షన్ మెంబర్ ప్రకాష్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కమలాపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముమ్మడిసిద్దుపల్లె గ్రామ పంచాయతీలోని జగంరెడ్డిపల్లెలో రూ.46 లక్షలు ఎస్‌డీఎఫ్ నిధులతో చేపడుతున్న సీసీరోడ్లు, డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో డ్రైనేజీ, సీసీరోడ్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. జగంరెడ్డిపల్లెలోని అన్ని వీధుల్లో డ్రైనేజీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేసి మోడల్ గ్రామంగా తయారు చేస్తామన్నారు. పనులు కూడా నాణ్యతగా చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్న వెంకటసుబ్బారెడ్డి కుమార్తె నూతన వధువరులైన ప్రత్యూష, రామాంజనేయరెడ్డిల రిసెప్షన్‌కు హాజరైయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఎస్సార్‌సీపీ నాయకులు ఖాదర్ పాల్గొన్నారు.


అంతరాయం లేని విద్యుత్‌ను అందించాలి



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

వేంపల్లె : జిల్లాలో అంతరాయం లేని నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను అందించాలని విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ ఎస్.రమణ అధికారులను ఆదేశించారు. మంగళవారం విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని చక్రాయపేట మండలంలోని 33/11 కుప్పం రాజుపల్లె సబ్‌స్టేషన్, తదితర ప్రాంతాల్లోని లైన్‌మెన్లను, వీరన్నగట్టుపల్లెలోని ట్రాన్స్‌ఫార్మర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన సలహాలు, సూచనలు తెలియజేశారు. స్థానిక మధురెడ్డి ఫంక్షన్ హాలులో వేంపల్లె విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని వేంపల్లె, చక్రాయపేట, వేముల మండలాల విద్యుత్ కార్యాలయ సిబ్బంది, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైఎస్సార్ జిల్లాలో మొట్టమొదటిసారిగా వేంపల్లె రూరల్స్ విభాగం వారు అనేక అంశాలలో ముందుండటం వైఎస్సార్ జిల్లాకే తలమానికమన్నారు. జిల్లాలోని మిగతవారు వేంపల్లె రూరల్స్ విభాగాన్ని ఆదర్శంగా తీసుకుని సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. విద్యుత్ ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కారం కావాలని ఆదేశించారు. ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృథా కాకూడదని.. పగటిపూట వీధిలైట్లు వెలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అవసరమైన ప్రాంతాలలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి సకాలంలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈ శ్రీనివాసులు, డీఈఈలు శ్రీకాంత్, గురుమోహన్‌రెడ్డి, ఏఈలు, అకౌంట్స్ ఆఫీసర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు శక్తివంతమైన ఆయుధం



ర్యాలీ నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

కమలాపురం : ప్రజాస్వామ్యంలో శక్తి వంతమైన ఆయుధం ఓటు అని మండల తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు మదర్ థెరిసా సేవాసమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అనేది శక్తివంతమైన ఆయుధం అన్నారు. మన ప్రాంతాలను అభివృద్ధి పరచుకోవాలంటే ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచి పాలకుడిని ఎన్నుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రాముడు, మదర్ థెరిసా సేవాసమితి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్ మాట్లాడుతూ ఒకే ఒక్క ఓటుతో ప్రధాన మంత్రి పదవి కోల్పోయినవారు ఉన్నారని, అలాగే ఒక్క ఓటుతో అధికారం చేపట్టిన వారు ఉన్నారని, యువత మేల్కోవాలని వారు పిలుపునిచ్చారు.

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీఓ వెంకటేశులు తెలిపారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు, ఓటు నమోదు కార్యక్రమంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం కళాశాల నుంచి పూలంగళ్ల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ రమేష్‌బాబు, డీటీ జగదీష్, సేవా సమితి అధ్యక్షుడు రాజు, వైస్ ప్రిన్సిపాల్ సుధీర, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఉపాధ్యాయుడు ఎల్ఐపీ ద్వారా బోధించాలి

ఎర్రగుంట్ల : ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు బోధించేటప్పుడు లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగాం(ఎల్ఐపీ)ని ఖచ్చితంగా పాటించాలని స్టేట్ మానిటరింగ్ టీం కన్వీనర్ డాక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో ఎల్ఐపీ అమలు తీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎల్ఐపీ ద్వారా బోధిస్తే విద్యార్థులకు చాలా సులువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీం ఫ్యాకల్టీ కే రాజేంద్రప్రసాద్, నరసింహారెడ్డి, డి.చిన్నబాబసాహెబ్, జీ నాగప్పలు పరిశీలకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈఓ శివప్రసాద్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రేపు ఆలయ వార్షికోత్సవం

వల్లూరు : మండలంలోని బక్కిరెడ్డిపల్లె సమీపంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం జరుగుతుందని ఆలయ ధర్మకర్తల మండలి కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు వలంటీర్లకు వందనం

సింహాద్రిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి వలంటీర్లతోపాటు పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఆయన కోరారు.

సంక్షేమం, అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

పెద్దముడియం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని జంగాలపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను అధికారులతో కలిసి వారు నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సమస్యలు తెలుసుకుని అక్కడే ఉన్న అధికారలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. అధికారం చేపట్టిన ప్పటి నుంచి ఇప్పటి వరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రెండున్నర లక్షల కోట్లపైగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారన్నారు. రాష్ట్ర వ్యవసాయ ఉద్యాన సలహాదారు ప్రసాద్‌రెడి, జిల్లా యువజన కార్యదర్శి సర్వేష్‌రెడ్డి, శ్రీనువాసులరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుధీర్ రెడ్డి, గ్యాస్ శివారెడ్డి, బాలగోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి, వీరారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సి.రమణారెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సిద్ధేశ్వరస్వామి పునః ప్రాణ ప్రతిష్ట

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం బండ్లయ్యగారిపల్లె వద్ద నున్న వైతరణీ నది వద్దున వెలసిన శ్రీసిద్ధేశ్వరస్వామి పునః స్థిర ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని గండి భూమానందాశ్రమ పీఠాధిపతి మాతాజీ ప్రారంభించారు. ఈ ఆలయానికి రెడ్డివారిపల్లెకు చెందిన అల్లపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు సొంత నిధులతో పాటు దాతల నుంచి కొంత నగదు సేకరించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డిల సహకారం, ముఖ్యమంత్రి ఆదేశాలతో దేవదాయ శాఖ సీజీఎఫ్ నిధుల నుంచి నిధులు మంజూరు చేయడంతో ఆలయాన్ని సుందరంగా తీర్చి దిద్దారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరు కావాలని కోరారు.

ఆర్‌సీడీఎస్ రైతు విభాగపు రాష్ట్ర అధ్యక్షుడిగా అరవిందనాథరెడ్డి

పులివెందుల టౌన్ : రెడ్డి కమ్యూనిటీ డెవెలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వై.సురేంద్రారెడ్డి ఆదేశాల మేరకు రైతు విభాగపు రాష్ట్ర అధ్యక్షుడిగా అరవిందనాథరెడ్డిని నిమించడం జరిగింది. అరవిందనాథరెడ్డి మాట్లాడుతూ రైతులకు నావంతు సహాయ సహకారాలు అందిస్తానని, సొసైటీ నియమ నిబంధనలకు కట్టుబడి సేవ చేస్తానన్నారు. ఆర్‌సీడీఎస్ సభ్యత్వం కొరకు 9704093708 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

తెగుళ్లను నివారిస్తేనే అధిక దిగుబడులు

వేముల : నువ్వుల పంటలో తెగుళ్లను నివారిస్తేనే అధిక దిగుబడులు వస్తాయని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం నువ్వుల పంటకు తెగుళ్లు అనే వార్త సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన వ్యవసాయ అధికారులు గొందిపల్లె, వేముల గ్రామాల్లో సాగులో ఉన్న నువ్వుల పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నువ్వుల పంటలో రసం పీల్చు పురుగు, బూడిద తెగులు, వేరుకుళ్లు తెగుళ్లు సోకాయన్నారు. వాతావరణ పరిస్థితులలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండి పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయన్నారు. వీటికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రసంపీల్చే పురుగుల నివారణకు ఇమిడాక్లోరోఫ్రిడ్ లీటరు నీటికి 0.5ఎం.ఎల్, లేదా అస్పెట్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే బూడిద తెగులు నివారణకు ఎక్సాక్రోనోజెల్ 2 ఎంఎల్ లీటీరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఇమ్రాడ్ 2 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఏఓ చెన్నారెడ్డి, ఆర్‌బీకే ఇన్‌చార్జి లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో అన్ని రకాల ఉత్పత్తులు

వేంపల్లె : రైతులకు కావాల్సిన అన్ని రకాల ఉత్పత్తులు ఎఫ్‌పీఓ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని సీఎస్ఏ సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆదినారాయణ తెలిపారు. మంగళవారం సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ కోఆపరేటివ్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు పండించినటువంటి వివిధ రకాల ఉత్పత్తులను స్థానిక మార్కెట్ కంటే 5 శాతం ఎక్కువ ధరకు సంఘం ద్వారా మార్కెట్‌లో అమ్ముకునే వెసులుబాటును సంఘం కల్పిస్తోందన్నారు. డీసీసీ బ్యాంక్ మేనేజర్ బాలాజి మాట్లాడుతూ మిగతా ఎఫ్‌పీఓల మాదిరిగానే ఈ ఎఫ్‌పీఓ కూడా ముందుకెళ్లాలని ఆశిస్తున్నామని.. వారికి కావాల్సిన ఫైనాన్షియల్ సపోర్ట్, లోన్స్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. హెచ్ఓ రెడ్డయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలను ఈ సంఘానికి ఇవ్వడంలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. వేంపల్లె ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార సంఘ చైర్మన్ నాగన్న, రైతులు సీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ పెట్టాలి

ముద్దనూరు : తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ వహించి, వారి పురోగతికి తగిన చర్యలు తీసుకోవాలని లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్) రాష్ట్ర బృందం సభ్యులు, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, రాజేంద్రప్రసాద్, నరసింహారెడ్డి, నాగప్పలు సూచించారు. అభ్యసనాభివృద్ధి అంశాల పురోగతిపై రాష్ట్ర టీం మంగళవారం ముద్దనూరు జిల్లా పరిషత్ బాలికోన్నతపాఠశాలను పరిశీలించారు. బృంద సభ్యులు విద్యార్థుల అభ్యసనా నైపుణ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో నాయక్ తదితరులు పాల్గొన్నారు.